ఫ్యాన్ పోలీస్..!

విస్తుగొలిపేలా పోలీసుల తీరు

కళ్యాణదుర్గంలో కానిస్టేబుల్ కొనుగోళ్లు

అమిలినేని యశ్వంత్‌పై దాడికి యత్నం

రాయదుర్గంలో హెడ్ కానిస్టేబుల్ బేరసారాలు.. బెదిరింపులు





కళ్యాణదుర్గంలో టీడీపీ కార్యకర్తలపైకి రాళ్లు రువ్వుతున్న వైసీపీ కార్యకర్త

పోస్టల్ ఓటర్లతో బేరసారాలు

కళ్యాణదుర్గం/రాయదుర్గం మే 6: పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కొనుగోలు చేసేందుకు జిల్లాలో కొందరు పోలీసులను వైసీపీ నాయకులు వాడుకుంటున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఫెసిలిటీ కేంద్రాల వద్ద కొందరు పోలీసులు కొనుగోలు వ్యవహారాలో కీలకంగా వ్యవహరించారు. కళ్యాణదుర్గం టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుటే సోమవారం ఓ కానిస్టేబుల్ పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాను పట్టుకుని.. వైసీపీవారి కొనుగోలు ప్రయత్నాలకు సహరించారు. సమాచారం అందుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు యశ్వంత్ చౌదరి అక్కడికి చేరుకుని కానిస్టేబుల్‌ను నిలదీశారు. 'మీ దగ్గర జాబితా ఎందుకుంది..?' అని ప్రశ్నించడంతో కానిస్టేబుల్ వాగ్వాదానికి దిగారు. ఆ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్వో రాణి సుష్మితకు యశ్వంత్ ఫిర్యాదు చేశారు. ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వస్తున్న యశ్వంత్‌పై వైసీపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుటే ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. ఓ వైసీపీ కార్యకర్త టీడీపీ నాయకులు, కార్యకర్తలపై రాళ్లు విసిరారు. పోలీస్ స్టేషన్, ఆర్వో కార్యాలయం ఎదుటే భారీ గొడవ జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిచ్చింది.

బేరసారాల బాధ్యత..

రాయదుర్గంలో ఓ హెడ్ కానిస్టేబుల్ పోస్టల్ ఓట్లను కొనుగోలు చేస్తూ కనిపించారు. మూడు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రానికి సమీపంలో ఆయన మకాం వేశారు. వైసీపీ నాయకులు డబ్బు పంపిణీ బాధ్యతను ఆయనకే అప్పగించినట్లు తెలిసింది. ఇద్దరు ఉపాధ్యాయులను వెంటబెట్టుకుని ఓటుకు రూ.1500 దాకా పంపిణీ చేస్తున్నారు. వైసీపీకి అనుకూలంగా లేని వారిని ఆయన బెదిరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు సస్పెండ్ అయినా.. ఏమాత్రం మార్పు కనిపించడం లేదని సమాచారం. 'వైసీపీకి 110 స్థానాలు వస్తాయి. అప్పుడు మీ సంగతి చూస్తాం' అని ఓటింగ్‌లో పాల్గొనే ప్రభుత్వ వ్యతిరేక ఉద్యోగులను బెదిరిస్తున్నారని సమాచారం. వైసీపీ నాయకులను వెంట పెట్టుకుని ఆయన బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. వైసీపీ కళ్యాణదుర్గం సోషల్ మీడియా గ్రూపులలో కూడా ఆయన పలు పోస్టులు పెట్టారు. వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని ఆయనపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం.

కళ్యాణదుర్గం పీఎస్ ఎదుటే టీడీపీ కార్యకర్తలపై దాడికి తెగబడుతున్న వైసీపీ వర్గీయులు





సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు

ఓటుకు రూ.5 వేలు

రాప్తాడు: టీటీడీసీ కేంద్రం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు వైసీపీ భారీగా క్యాష్ ఆఫర్ చేస్తోంది. ఫెసిలిటీ సెంటర్ వద్ద వైసీపీ నాయకులు తిష్ట వేసి.. ఒక్కో ఓటుకు రూ.5 వేల వరకూ ఇస్తామని ప్రలోభ పెడుతున్నారు. నగదు, ఫోన్‌పే, గూగుల్ పే.. ఎలా కావాలంటే అలా ఇస్తామంటున్నారు. చాలా మంది ఉద్యోగులు డబ్బు తీసుకోలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తామని కొందరు వైసీపీ నాయకులకు మొహం మీదే చెప్పేశారు.



పెద్ద వికెట్టే..!

- డీఐజీ అమ్మిరెడ్డిపై బదిలీ వేటు
- వైసీపీతో అంటకాగిన ఫలితం..





డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం క్రైం, మే 6: అధికార పార్టీతో అంటకాగుతున్న ఒక్కొక్కరిని ఎన్నికల కమిషన్ ఏరిపారేస్తోంది. కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, సీఐలు.. తాజాగా అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి..! ఒక్కొక్కరిపై బదిలీ వేటు పడుతూనే ఉంది. డీఐజీ అమ్మిరెడ్డిని బదిలీ చేయడంతోపాటు ఆయనను ఎన్నికల విధులకు దూరంగా పెట్టాలని ఎన్నికల కమిషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే విధుల నుంచి రిలీవ్ కావాలని, కిందిస్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అనంతపురం రేంజ్ డీఐజీగా ఆయన గత ఏడాది ఏప్రిల్ 13న బాధ్యతలు చేపట్టారు. అప్పటి ఎస్పీ శ్రీనివాసులు కంటే తన మాటే పోలీస్ శాఖలో చలామణి అయ్యేలా వ్యవహారం నడిపారు. రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాలలో వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సమయంలో అంగళ్లలో జరిగిన ఘటన విషయంలో ఆయన వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. ఆ సమయంలో టీడీపీ నాయకులపై కేసులు బనాయించడం, బైండోవర్ చేయడం, రౌడీషీట్ తెరిపించడంలోనూ డీఐజీ అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలున్నాయి. తన రేంజ్ పరిధిలో వైసీపీ సామాజికవర్గానికి చెందిన సీఐలను నియమించుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీటన్నింటిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయనపై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కాగా, వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నందుకు అనంతపురం డీఎస్పీ వీరరామవరెడ్డిని ఈసీ ఆదివారం బదిలీ చేసింది. ఆయన స్థానంలో టీవీవీ ప్రతాప్ కుమార్‌ను నియమించింది.

నెలగొండకు అస్వస్థత

20 మంది ఆస్పత్రిపాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నెలగొండ ప్రజలు

గుంతకల్లు టౌన్, మే 6: మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో 20 మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. ఆరుగురు ఆదివారం రాత్రి, 14 మంది సోమవారం అస్వస్థతకు గురయ్యారు. వారిని కుటుంబ సభ్యులు గుంతకల్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించారు. వారం రోజుల నుంచి గుంతకల్లు మండలంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలా ఒకేసారి ఇంతమంది అస్వస్థతకు గురికాలేదని గ్రామస్థులు తెలిపారు. వీరికి వడదెబ్బ సోకిందా, కలుషిత నీరు తాగడం వల్ల అస్వస్థతకు గురయ్యారా అని వైద్యులు పరీక్షిస్తున్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



పెద్దవడుగూరు, మే 6: మండల కేంద్రానికి చెందిన పెద్ద సంజన్న (65) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. కొన్నిరోజులుగా ఎండలు మండుతుండడంతో పెద్ద సంజన్న అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిస్వార్థంగా సేవ చేస్తా..!

తాడిపత్రి ప్రజల రుణం తీర్చుకోలేనిది..

టీడీపీ కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి



జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి టౌన్, మే 5: 'తాడిపత్రి ప్రజలే మా కుటుంబానికి దేవుళ్లు... నిస్వార్థంగా సేవచేయడం తప్ప మరేమిచ్చినా జేసీ ఫ్యామిలీ వారికి రుణం తీర్చుకోలేదు..' అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆ వివరాలు..

ఇంటర్వ్యూ Interview

● ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

అశ్మిత్: ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు మా నాయన చేసిన అభివృద్ధే తప్ప ఈ ఐదేళ్లల్లో పాలకులు చేసిందేమి లేదని ప్రజలు అంటుంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మంచి చేస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారనడానికి ఇదే నిదర్శనం. 'అన్నా చదువుకున్న మీలాంటోళ్లు వస్తేనే మా జీవితాలు బాగుపడతాయి' అని చెప్పడం నాపై మరింత బాధ్యత పెంచింది. ప్రచారంలో జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సహకారం మరువలేనిది.

● అభివృద్ధి చేశామని పాలకులు చెబుతున్నారే...

అశ్మిత్: నియోజకవర్గంలో అభివృద్ధి పడకేసిందని ఎవరిని అడిగినా చెబుతారు. మేం ఏ అభివృద్ధి పనిచేసినా వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అనుచరులు అడ్డుపడటం పరిపాటిగా మారింది. ఎక్కడ మా ఫ్యామిలీకి మంచిపేరు వస్తుందో అని, ఎన్నికలు దగ్గరపడడంతో హడావుడిగా ఏరియా ఆసుపత్రి భవనం ప్రారంభించారు. అందులో ఎలాంటి సౌకర్యాలూ లేవు.

● గెలిస్తే ప్రజలకు ఏమి చేస్తారు?

అశ్మిత్: సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాను. తాడిపత్రి పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్వహణ, చెత్త సేకరణ సరిగా లేదు. మునుపటి కంటే మరింత మెరుగ్గా చేస్తాను. విద్యార్థుల కోసం యాడికి, పెద్దవడుగూరు మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయిస్తాను. యువత సొంతంగా ఉపాధి పొందేలా చేస్తాను.

● గ్రానైట్ పరిశ్రమలను తెరిపిస్తారా?

అశ్మిత్: తాడిపత్రి నల్లబండలు, గ్రానైట్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. వైసీపీ అధికారంలోకి రాగానే గ్రహణం పట్టింది. వందలాది పరిశ్రమలు మూతపడ్డాయి. నారా లోకేష్‌ను కలిసిన ప్రతిసారి ఈ విషయాన్ని చెప్పాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిశ్రమలకు పూర్వవైభవం కచ్చితంగా తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు.

● టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్ముతున్నారా?

అశ్మిత్: వందశాతం నమ్ముతున్నారు. ఎప్పుడెప్పుడు టీడీపీ పాలన వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. టీడీపీ మేనిఫెస్టోపై యువత, మహిళలు ఆనందంగా ఉన్నారు.

● అరాచకశక్తులను ఎలా ఎదుర్కొంటారు?

అశ్మిత్: గత ఎన్నికల్లో నాపై వైసీపీ మూకలు దాడికి ప్రయత్నించాయి. ఆ సమయంలో పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పెద్దారెడ్డి మా ఇంటిపైకి వచ్చారు. ఆ సమయంలో అప్పటి పోలీసు వ్యవస్థ నిర్వీర్యంగా మారింది. ప్రస్తుతం పోలీసు అధికారులు బాగా పనిచేస్తున్నారు. ప్రజల ఆశీస్సులతో వైసీపీవారు చేసే కుట్రలు, కుతంత్రాలు, దాడులను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటాం. తాడిపత్రిలో రౌడీయిజం లేకుండా కూకటి వేళ్లతో పెకిలిస్తా..

ఉష్ణోగ్రతలు

గరిష్ఠం కనిష్ఠం | 44.0 28.0





బీజేపీ పెద్దల ముప్పేటదాడి

వైసీపీ అభ్యర్థుల్లో అంతర్మథనం

జిల్లాలో మారుతున్న సమీకరణలు

డబుల్ ఇంజిన్ సర్కారుపైనే జనం ఆశలు

అనంతపురం, మే 6(ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి ఐదేళ్ల అధికారమిచ్చినా రాష్ట్రానికి ఏమీ చేయలేదు. ఆ పార్టీ పూర్తిగా ప్రజాగ్రహానికి గురైంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పట్టాలపై పరిగెత్తింది. వైసీపీ అధికారంలోకి రాగానే పట్టాలు తప్పింది. జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో సున్నా.. అవినీతిలో నంబర్ వన్. మూడు రాజధానులు నిర్మిస్తామని చెప్పి ప్రజలను జగన్ నిండా ముంచేశారు. చివరికి రాజధాని లేకుండా చేశారు. చంద్రబాబు నాయకత్వం ఏపీకి అవసరం. మరోసారి కూటమికి అధికారం ఇవ్వాలి..'

- రాజమహేంద్రవరం సభలో ప్రధాని మోదీ

'రాష్ట్రంలో గూండాగిరీ, అరాచకం, భూ మాఫియా, మద్యం సిండికేట్ రాజ్యమేలుతున్నాయి. వీటిని అంతం చేయడానికి.. అమరావతిని మళ్లీ రాజధానిగా ఏర్పాటు చేసుకోవడానికే కూటమిగా ఏర్పడ్డాం. తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడేందుకు, తెలుగు భాషను రక్షించుకునేందుకే కూటమిగా ఏర్పడ్డాం. అవినీతిలో కూరుకుపోయిన జగన్.. పోలవరం నిర్మాణాన్ని ఆలస్యం చేశారు. ఉమ్మడి ఏపీతో పాటు.. విభజిత ఏపీని చంద్రబాబు ప్రగతిపథంలో నిలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిదే అధికారం..'

- ధర్మవరం ప్రజాగళం సభలో కేంద్రం హోం మంత్రి అమిత్‌షా

బీజేపీ పెద్దలు, అందులోనూ దేశ ప్రధాని, కేంద్ర హోం మంత్రి సీఎం జగన్ పాలనపై ముప్పేట దాడికి దిగారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ఇద్దరు అగ్రనేతల ప్రసంగాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వైసీపీ ఐదేళ్ల పాలనపై దుమ్మెత్తిపోస్తున్నారు. అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, దాడులతో అరాచక పాలన తప్ప.. అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు సాగించిన అక్రమాలు, అకృత్యాలు, దౌర్జన్యాలను సైతం చంద్రబాబు, లోకేశ్ ఎండగట్టారు. బాదుడే బాదుడు, ప్రజాగళం సభల్లో చంద్రబాబు, అంతకుముందు యువగళం, శంఖారావం సభల్లో నారా లోకేశ్ వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని తూర్పారబట్టారు. తాజాగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం జగన్ పాలనను ఎండగట్టడంతో వైసీపీ అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది.

సీన్ మారుతోంది..

జిల్లాలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందుతోంది. కూటమిదే అధికారమని బీజేపీ పెద్దలు సైతం ప్రకటించారు. ఇది ప్రజల్లో మరింత మార్పునకు నాంది పలుకుతోంది. విభజిత ఏపీ తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఐదేళ్ల పాలనను, సీఎం జగన్ నేతృత్వంలోని వైసీపీ ఐదేళ్ల పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. లోటు బడ్జెట్‌తో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు, అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేశారు. అభివృద్ధికి కూడా బాటలు వేశారు. జగన్‌కు అధికారమిస్తే రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేస్తారని జనం ఆశించారు. కానీ బటన్ నొక్కుడుతో సరిపెట్టారు. దీనివల్ల జిల్లాకు ఒరిగింది లేదు. ఇది కరువు జిల్లా ప్రజానీకం అభిప్రాయం. యువతకు ఉద్యోగాలను కల్పించలేదు. జిల్లాకిచ్చిన హామీలను నెరవేర్చలేదు. ఈ క్రమంలో వైసీపీ పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే సంక్షేమం... జిల్లా అభివృద్ధి సాధ్యమని జనం భావిస్తున్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే మేలు జరుగుతుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థుల్లో గుబులు

పోలింగ్ సమయం దగ్గర పడేకొద్దీ వైసీపీ అభ్యర్థుల్లో ఆత్మస్థైర్యం తగ్గుతోంది. తమ పార్టీ మేనిఫెస్టోలో చెప్పుకోదగ్గ అంశాలు లేకపోవడం, గత మేనిఫెస్టోనే ఈసారి కూడా ప్రకటించడంతో వైసీపీ అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మేనిఫెస్టో మొత్తం కొత్త సీసాలో పాతసారా అన్నచందంగా రూపొందించారని వైసీపీ అభ్యర్థులే వాపోతున్నారు. మేనిఫెస్టో తమను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని వైసీపీ శ్రేణులు అంటున్నాయి. కూటమి మేనిఫెస్టోకు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆమోదం లభిస్తోంది. ఇది వైసీపీ అభ్యర్థులను మరింత కుంగదీస్తోంది. ఎన్నికల తరువాత పరిస్థితి ఏమిటని భవిష్యత్తుపై బెంగ పట్టుకుంది.

ఉరిమే ఉత్సాహం..!

టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటన కూటమిలో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ధర్మవరంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో కలిసి, అనంతలో ఆదివారం స్వయంగా తానే ప్రచార సభలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో రాత్రికి బసచేసి.. నాయకులకు దిశానిర్దేశం చేశారు. నంద్యాల జిల్లాలో జరిగే ప్రజాగళం సభకు సోమవారం ఉదయం బయలుదేరారు. ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు ఆయనకు వీడ్కోలు పలికారు.



చెల్లనీకుండా చేస్తున్నారా..!

పోస్టల్ బ్యాలెట్ చుట్టూ కుట్రలు

గెజిటెడ్ అధికారి సీల్ వేయడం లేదా..?





అనంతపురం విద్య, మే 6: పోస్టల్ బ్యాలెట్ ఓటు చుట్టూ గూడుపుఠాణి సాగుతోందని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పోస్టల్ ఓట్లను చెల్లనీకుండా చేసేందుకు కొందరు అధికారులు కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల విధులకు వెళ్లే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి ఓట్లు వేస్తున్నారు. ఈ సమయంలో ఓటరు ఫారం-13ఎ పై తన పోస్టల్ బ్యాలెట్ నంబర్ రాసి, సంతకం చేయాలి. ఆ తర్వాత ఆ కేంద్రంలో ఎన్నికల విధుల్లో ఉన్న గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవాలి. సీల్ కూడా వేయించుకోవాలి. అయితే కొన్ని కేంద్రాల్లో గెజిటెడ్ అధికారులు సంతకాలు చేసిన తర్వాత 13-ఎపై సీల్ వేయలేదని ప్రచారం జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ వేసిన తొలిరోజు చాలాచోట్ల ఇలాగే చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. సీల్ వేయకుంటే ఆ ఓటు చెల్లదు. ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఫెసిలిటేషన్ కేంద్రానికి ఓటర్లు ఎక్కువగా వస్తే.. రద్దీకి తగినట్లుగా ఇద్దరు లేదా ముగ్గురు గెజిటెడ్ అధికారులను నియమించే వెసలుబాటు ఉంది. కానీ కొన్ని కేంద్రాల్లో ఒక గెజిటెడ్ అధికారిని మాత్రమే నియమించారు. ఫలితంగా ఓటింగ్ ఆలస్యం అవుతోంది. వైసీపీకి వ్యతిరేకంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు క్యూకడుతున్నారు. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలో ఎలాగైనా ప్రభుత్వ వ్యతిరేక ఓటును కట్టడి చేయాలని, అధిక శాతం ఓట్లను చెల్లకుండా చేయాలని కొందరు అధికారులు దగ్గరుండి కుతంత్రాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

రద్దీ.. ఆందోళన

అనంతపురం టౌన్: డ్వామా కార్యాలయం వద్ద అంతర్ జిల్లా ఓటర్లు మరో పోలింగ్ సెంటర్ ఏర్పాటుచేయాలని సోమవారం ఆందోళనకు దిగారు. కర్నూలు, కడప, చిత్తూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఓటర్లు అక్కడికి భారీగా వచ్చారు. రద్దీ కారణంగా ఓటు వేయడానికి గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. తమకు మంగళవారం ఎన్నికల విధులపై శిక్షణ ఉందని, త్వరగా ఓటింగ్ జరిగేలా చూడాలని అడిగినా ఎవరూ స్పందించలేదు. దీంతో అక్కడ ఇంకో సెంటర్ ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని పోలింగ్ అధికారులు చెప్పడంతో శాంతించారు.

65 శాతం దాటింది..!

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై కలెక్టర్

అనంతపురం టౌన్ : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్లు దాదాపు 65 శాతం పోలయ్యాయని కలెక్టరు వినోద్ కుమార్ సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 26,150 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయని, ఈనెల 3 నుంచి ఓటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నాలుగు రోజుల్లో 17,985 ఓట్లు పోలైనట్లు చెప్పారు. ఇందులో రాయదుర్గంలో 1,073, ఉరవకొండలో 1,422 ఓట్లు, గుంతకల్‌లో 2,015 ఓట్లు, తాడిపత్రిలో 1,652 ఓట్లు, శింగనమలలో 1,772 ఓట్లు, అనంతపురం అర్బన్‌లో 4,145 ఓట్లు, కళ్యాణదుర్గంలో 2,290 ఓట్లు, రాప్తాడులో 2,290 ఓట్లు పోలయ్యాయని వెల్లడించారు. అలాగే అంతర జిల్లాల వారివి 2,280 ఓట్లు పోలైనట్లు కలెక్టరు తెలిపారు. ఇంకా రెండు రోజులు ఓటేసే అవకాశం ఉందని, దీంతో పోలింగ్ శాతం 90 దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నాటితే సరిపోతుందా..?



రుద్రంపేట సర్కిల్ నుంచి కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్ వరకూ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన నాటిన చెట్లు ఇవి. మండే ఎండలకు నీళ్లు లేక నిలువునా ఎండిపోతున్నాయి. ఇప్పటికే కొన్ని చనిపోయాయి. మొక్కలు నాటించడంతో తమ పని అయిపోయినట్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు భావించినట్లున్నారు. హైవే నిర్మాణ క్రమంలో కొన్ని వందల వేప చెట్లను నిలువునా నరికేశారు. వాటి స్థానంలో కొన్నింటినైనా పెంచాల్సిన బాధ్యత లేదా..? మొక్కలు నాటే సమయంలో ఫొటోలకు ఫోజులు ఇవ్వడం.. పెద్ద పెద్ద లెక్చర్లు ఇవ్వడం.. ఘనకార్యం చేసినట్లు సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టుకుంటే సరిపోతుందా..? స్వచ్ఛంద సంస్థలకో, విద్యాసంస్థల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మొక్కలు పెంచే బాధ్యతను అప్పగించినా వాటిని కాపాడుకుంటారు కదా..! చిత్తశుద్ధి లేకుంటే ఎలా..? పర్యావరణంపై దాడి చేయడానికి ముందుండే యంత్రాంగం.. సమతుల్యతను కాపాడటంలోనూ అంతే ముందుండాలి కదా..?

- అనంతపురం రూరల్



రుద్రంపేట సమీపంలో సర్వీసు రోడ్డులో ఎండిపోతున్న చెట్లు

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే ఓటు



తొలిసారి ఓటు వేస్తున్నా.. గత ఐదేళ్లలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగుళూరు, హైదరబాదు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. స్థానికంగా పరిశ్రమలు నెలకొల్పితే బాగుంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. కియా పరిశ్రమ లాంటివి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం తీవ్ర నిరాశకు గురయ్యాం. ఉద్యోగాల భర్తీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి యువకుడు ఇదేవిధంగా ఆలోచిస్తున్నారు. అలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలనుకుంటున్నారు.

- సూర్యప్రతాప్‌గౌడ్, సిండికేట్ నగర్ అనంతపురం రూరల్

చెరువులకు నీళ్లిస్తామని మాట తప్పారు..

అధికారంలోకి వస్తే కృష్ణా జలాలను హంద్రీనీవా కాలువల ద్వారా తీసుకు వచ్చి చెరువులను నింపి సాగు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పిన వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక హామీని గాలికి వదిలేశారు. ఒక్కచెరువుకు నీరు నింపలేదు. దీంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లలో నీళ్లు లేక పండ్లతోటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు బోర్లకు మీటర్లు బిగించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయారు. హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు నీరు వదిలి తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించాలి.



- యంజారప్ప, రైతు, మల్లినమడుగు, రొళ్ల మండలం(మడకశిర)

బాబుకు దివ్యాంగులు రుణపడి ఉంటారు



చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు ఇస్తారు. ఆ పార్టీ మేనిఫెస్టోలో దివ్యాంగులకు హామీ ఇచ్చారు. దివ్యాంగులు అందరూ బాబుకు రుణపడి ఉంటారు. నేను బీఏ వరకు చదువుకున్నాను, దివ్యాంగుడిని. జగన్ దివ్యాంగులకు సంక్షేమంలో ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఇప్పుడు పింఛన్ రూ.3వేలు ఇస్తున్నారు. చంద్రన్న నెలకు రూ.6వేలు పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చారు. తప్పకుండా హామీ నెరువేరుస్తారని ఆశతో ఉన్నాం.

- ఆదినారాయణ, దివ్యాంగుడు, శింగనమల

జగన్‌ను కాదు.. మమ్మల్ని చూడండి

ప్లీజ్.. ప్లీజ్.. డబ్బులిస్తాం ఓటెయ్యండి

వైసీపీ శ్రేణులు, అనుకూల ఉపాధ్యాయ నేతల వేడుకోలు

అనంతపురం టౌన్, మే 6: 'చూడండి సార్, మేడమ్.. మీరు జగన్‌ను చూడొద్దు .. ఇక్కడ లోకల్‌గా అనంత వెంకటరామిరెడ్డిని, మమ్ములను చూడండి.. ప్లీజ్.. ప్లీజ్.. కావాలంటే డబ్బులిస్తాం, మాకు ఓటెయండి' అంటూ అధికార వైసీపీ శ్రేణులు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టల్ ఓట్ల కోసం జిల్లా కేంద్రంలో బేరమాడడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌తోపాటు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, పీఆర్‌సీ, హెచ్‌ఆర్‌ఏలు కట్‌చేసి జీతాలు తగ్గించడం, అడిగినోళ్లపై కక్షసాధింపులకు దిగడం వంటివి చేస్తూ వచ్చారు. ఇలా అనే రకాలుగా వేధింపులకు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈసారి సీఎం జగన్ పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో సీఎంకు వ్యతిరేకంగా 80శాతానికి పైగానే ఓట్లు వేస్తున్నారని ఆయా వర్గాలు చెబుతున్నాయి. దీంతో అనంతపురం జిల్లా కేంద్రంలో వైసీపీ నేతలు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు వినూత్న ప్రచారం ఎత్తుకున్నారు. ఎలాగైనా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తమవైపు తిప్పుకోవాలని, ఓటు వేయడానికి వస్తున్న వారికి రెండు వేలిస్తాం, మూడు వేలిస్తాం అంటూ వేడుకుంటూ ప్రలోభాలకు గురిచేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 'వీరికెంత సిగ్గులేదప్పా.. ఇంత అన్యాయం చేసి మళ్లీ ఇంత బరితెగించి ఓట్లు అడుగుతున్నారు' అని పెదవి విరుస్తున్నారు. సీఎం జగన్ పేరు చెప్పి ఓటు అడిగితే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓట్లు వేయరని వైసీపీ నాయకులే అంటున్నారంటే.. ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఇవి రోడ్లేనా..?

మోకాలి లోతు గుంతల్లో ప్రయాణం

వాహనదారులకు నరకప్రాయం

మరమ్మతులకు నోచుకోని రహదారులు

ప్రతి పల్లెకు రోడ్లు వేశామంటూ వైసీపీ ప్రచారాలు



మూడేళ్లుగా కంకర వేసి వదిలేసిన పాల్తూరు-కరకముక్కల రోడ్డు

విడపనకల్లు: ఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకార్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా కొత్తరోడ్లు వేయకపోగా.. ఉన్న రోడ్లను కూడా తవ్వి వదిలేశారు. వైసీపీ పాలకుల పుణ్యమా అంటూ కంకర్లు తేలిన రోడ్లతో ఆయా గ్రామాల ప్రజలు నరక ప్రయాణం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం కరకముక్కల-పాల్తూరు రోడ్డు వేయిస్తామంటూ దాదాపుగా మూడు కిలోమీటర్లు మేర బాగున్న రోడ్డును తవ్వించి కంకర వేసి వదిలేశారు. ఈ కంకర దారిలో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు ప్రతి రోజూ ఏదో ఒకచోట ప్రమాదానికి గురవుతున్నారు. దీంతో పాల్తూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులే రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. తారు రోడ్డు వేయటానికి చేత కాకాపోతే కనీసం మట్టి రోడ్డు అయినా వేయండి అంటూ వైసీపీ ప్రముఖ నాయకులు డిమాండ్ చేశారు. కానీ, అధికారుల్లో కానీ, ఆ పార్టీ నాయకుల్లో ఏమాత్రం చలనం రాలేదు. నాలుగేళ్లుగా కంకర వేసిన రోడ్డును పట్టించుకునే నాథుడేలేడని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా ఆర్.కొట్టాల-డొనేకల్లు రోడ్డును రెండేళ్ల క్రితం ఎక్స్‌కవేటర్లతో తవ్వించి చిన్న కంకర వేసి వదిలేశారు. నిధులు లేవంటూ పనులు నిలిపివేయటంతో ఆ రోడ్డున వెళ్లే రైతులు, గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకూ ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టిచుకోలేదు. గాజుల మల్లాపురం వెళ్లే మట్టి రోడ్డుపై వర్షాల కాలంలో మోకాలి లోతు గుంతలు పడి కనీసం మనుషులు కూడా నడిచి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వి.కొత్తకోట-విడపనకల్లు రోడ్డును గత టీడీపీ ప్రభుత్వంలో మర్మతులు చేయించారు. ప్రస్తుతం ఈ రోడ్డు మొత్తం వర్షాల కారణంగా కంకర్లు తేలి అధ్వానంగా మారిపోయింది. రోడ్డు పనులు చేయించాలని జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా దిక్కులేదు. విడపనకల్లు మండలం జనార్దనపల్లి నుంచి వజ్రకరూరు మండలం చాబాల వరకూ రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. ఈ మూడు కిలో మీటర్లు ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. కంకర్లు తొలగించి కనీసం మట్టి వేసినా బాగుండేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బూదగవి-చీకలగురికి రోడ్డు మరీ దారణంగా మారిపోయింది. రెండు చోట్ల బ్రిడ్జిలు పూర్తిగా శిథిలమయ్యాయి. రోడ్డు మొత్తం కంకర తేలింది. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు నుంచి పందికుంట వరకూ రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. నియోజకవర్గంలోని మరుట్ల రోడ్డు మరీ దారుణంగా మారిపోయాయి. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లని పరిస్థితిలో దారులు ఉన్నాయి. ఇంత దారుణంగా ఉన్నా వైసీపీ నాయకులకు ఏ మాత్రం కనిపించటంలేదు. ప్రతి గ్రామంలోను రోడ్లు వేశామంటూ ప్రచారం చేస్తుండడంపై గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఒక్క రోడ్డు కూడా వేసిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కంకర వేసి.. వదిలేశారు



నాలుగేళ్ల క్రితం కరకముక్కల-పాల్తూరు రహదారిలో తారు వేయాలని ఎక్స్‌కవేటర్లతో తవ్వించి 40 ఎంఎం కంకర వేశారు. నిధులు లేకపోవటంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేయకుండా వదిలేశాడు. కంకర తొలగించి కనీసం మట్టి రోడ్డు అయినా వేయండి అంటూ వైసీపీ నాయకులే రోడ్డుపై నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించలేదు. కంకర రోడ్డుపై పడిన చాలా పశువులు మృతి చెందాయి. అనేక మంది ద్విచక్ర వాహనదారులు కిందపడి ఆసుపత్రుల పాలయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అని చెప్పుకునే విశ్వేశ్వరరెడ్డికి పాల్తూరు రోడ్డు కనిపంచక పోవటం ఏమిటి. పల్లెల్లో అభివృద్ధి చేశామంటూ ఉత్తుత్తి మాటలు చెప్పి ఓట్లు అడిగేందుకు వస్తున్నాడు.

- చౌడికి గంగన్న, పాల్తూరు

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది



ఆర్.కొట్టాల నుంచి డొనేకల్లుకు వెళ్లే దారిని రెండేళ్ల క్రితం ఎక్స్‌కవేటర్లతో తవ్వించి చిన్న కంకర వేసి వదిలేశారు. పంటల కాలంలో రోడ్డును తవ్వటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తారు రోడ్డు వేయండి, లేదా కంకర తొలగించి మట్టి రోడ్డు అయినా వేయండని తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినా స్పందించలేదు. ధర్నాలు చేసినా అధికారుల్లో కానీ, అధికార పార్టీ నాయకుల్లో కానీ చలనం రాలేదు. ఇప్పటికి ఈ రోడ్డుపై కంకర అలాగే ఉంది. రైతులకు, ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిధుల లేవంటూ ఉన్న రోడ్డును తవ్వించి కంకర వేసి వదిలేశారు.

- పురుషోత్తంనాయుడు, ఆర్.కొట్టాల

ఐదేళ్లుగా గంప కంకర కూడా వేయలేదు



మా గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేశారు. ఇంక ఇప్పటి వరకూ ఒక్క గంప కంకర కూడా వేయలేదు. వర్షాల ధాటికి తారు రోడ్డు పూర్తిగా దెబ్బ తిని ఎక్కడిక్కడ గుంతలు పడి పోయి కంకర్లు తేలాయి. కనీసం మనుషులు కూడా రోడ్డుపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు మా గ్రామంవైపు తిరిగి చూడలేదు. ఇప్పుడు రోడ్లు వేస్తాం.. ఓటు వేయండి అని అడిగేందుకు వస్తున్నారు.

- కె.రంగస్వామి, వి.కొత్తకోట



కంకర తేలిన వి.కొత్తకోట-విడపనకల్లు రోడ్డు



మోకాలి లోతు గుంతలతో నిండిన గాజుల మల్లాపురం మట్టి రోడ్డు



కంకర తేలిన జనార్దనపల్లి-ధర్మపురి రోడ్డు



ఛిద్రమైన చాబాల-ధర్మపురి రోడ్డు



అర్ధంతరంగా ఆగిన కాలువ పనులు



నీరులేక వెలవెలబోతున్న గుండ్లపల్లి చెరువు

హామీ మరిచారు

నీరులేక బోసిపోతున్న చెరువులు

అడుగంటిన భూగర్భజలాలు

బీళ్లుగా మారుతున్న వ్యవసాయ తోటలు

గట్టెక్కేది ఎట్లా అంటూ రైతుల ఆందోళన

బెళుగుప్ప: మండలంలో ఎలాంటి సాగునీటి వనరులు లేవు. తీవ్ర వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గి, వాటి కింద సాగు చేసే వ్యవసాయ తోటలు బీళ్లుగా మారుతున్నాయి. అందుబాటులో ఉన్న చెరువుకు నీరుచేరితే తాగు, సాగు నీటి సమస్య తీరుతుంది. మండలంలో పది చెరువులుండగా.. గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రైతుల ఇబ్బందుల ను దృష్టిలో ఉంచుకుని శీర్పి, బెళుగుప్ప చెరువులను జీడిపల్లి రిజర్వాయరు ద్వారా కృష్ణా జలాలతో నింపారు. మిగిలిన చెరువులకు నీరిచ్చేందుకు కాలువ పనులు కొనసాగుతుండగా ముందుగా పరిహారం చెల్లించి కాలువలు తవ్వాలని వైసీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో కాలువల పనులు నిలిచిపోవడంతో కృష్ణా జలాలతో చెరువులు నింపడం ముందుకు సాగలేదు. ఈ లోగా ఎన్నికలొచ్చాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే అన్ని చెరువులు నింపి రైతన్నల సమస్యలు తీరుస్తామని అప్పట్లో ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. అలాగే తవ్విన కాలువల కోసం సేకరించిన భూములకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చింది. దాదాపు అయిదేళ్లు గడిచిపోయాయి. అయితే ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ గురించి పట్టించుకోలేదు. కాలువలు పూర్తికాలేదు. నీటితో చెరువులు నిండలేదు. చెరువులకు నీరొస్తే తమ కష్టాలు తీరుతాయని అనుకున్న మండలంలోని రైతులకు నిరాశే మిగిలింది. బోర్లన్నీ ఎండిపోయి వ్యవసాయ తోటలు బీళ్లుగా మారాయి. ప్రస్తుతం పరిస్థితుల్లో చెరువులను నీటితో నింపితే తప్ప తాము గట్టెక్కలేమని ఆవేదన చెందుతున్నా రు. ఈ ఐదేళ్ల కాలంలో రైతులకు ఇచ్చిన హామీ గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు, మళ్లీ ప్రస్తుత ఎన్నికల సందర్భంగా పాత పాట మొదలెట్టారు. వైసీపీని గెలిపించండి అన్ని చెరువులు నింపుతామని ఊకదంపుడు మాటలు చెబుతున్నారు. ఈ ఐదేళ్లు ఏమి చేసినట్లు.... ఇక చాలు మీ బూటకపు హామీలని రైతులు అంటున్నారు.

చెరువుకు నీరొస్తేనే గట్టెక్కేది..



చెరువులో నీరు లేక బోర్లన్నీ ఎండిపోతున్నాయి. నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ తోటలో రెండు బోర్లలో గతంలో నీరొచ్చేది. ఇప్పుడు అవి రెండింటిలో నీరు రావడం లేదు. నీరు లేకపోవడంతో పంటలు సాగు చేయలేక పోతున్నా. పొలాన్ని బీడు పెట్టాల్సి వస్తోంది. చెరువుకు నీరు వదిలితేనే వ్యవసాయం చేసి, నా కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చక పోవడంతో, మా సమస్యలు పరిష్కారం కాలేదు.

- సురేష్‌బాబు, రైతు, కోనాపురం

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

ఓటు ఉన్నచోటుకు డ్యూటీ ఆర్డర్‌తో వెళ్లాలి... కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 6: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 3 నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఓటింగ్ చేపట్టామని తెలిపారు. తొలి రెండు రోజులు కొంత గందరగోళం ఉన్నా ఇపుడు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ షెడ్యూల్ మేరకు సోమవారం ముగియాలన్నారు. చాలామంది ఓటు వినియోగించుకోకపోవడం, కొందరి పేర్లు జాబితాలో లేకపోవడంతో మరో రెండు రోజులు గడువు పొడగిస్తూ ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికల విధులకు నియమించి, ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారికి మరో రెండురోజులు (మంగళ, బుధ) అవకాశం ఇస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేర్లు లేనివారు ఆర్డర్‌తోపాటు ఓటరు ఐడీ, ఏదైనా గుర్తింపుకార్డు తీసుకొని ఓటు ఉన్నచోటుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమస్య వస్తే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే జిల్లాలో

నిబంధనల మేరకే హోం ఓటింగ్

హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. 85ఏళ్లు పైబడి నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు హోంఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 618 మంది, దివ్యాంగులు 629 మంది మొత్తం 1247 మంది హోంఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికి ఈనెల 5నుంచి కమిషన్ నిబంధనల మేరకు 38 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి హోం ఓటింగ్ చేపడుతున్నామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

రూ.32.37 కోట్లు సీజ్... రూ.27 కోట్లు రిలీజ్...

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ. 32.37 కోట్లు సీజ్‌చేశామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఆధారాలు చూపించిన తర్వాత అందులో రూ. 27 కోట్లు రిలీజ్ చేశామని వివరించారు. విచారణ అనంతరం 30 కిలోల బంగారం, వెండిని కూడా రిలీజ్ చేశామన్నారు. ఇటీవల అనంతపురం నగరంలో రూ. 1.50 కోట్లు పట్టుబడిందని, ఆ డబ్బు కదిరికి చెందిన వ్యక్తిది అని చెప్పడంతో సత్యసాయి జిల్లాకు ఈ కేసును రెఫర్ చేశామని కలెక్టర్ వెల్లడించారు.

ఉపాధి కల్పనకు పెద్దపీట

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాం

టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి

ప్రచారంలో అడుగడుగునా బ్రహ్మరథం

పుట్టపర్తి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమైందని, మరికొన్ని రోజుల్లో జగన్ రాక్షస పాలన అంతం కాబోతోందని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాప్తాడు, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పరిటాల సునీత, సవిత, పల్లె సింధూరరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, కేంద్రంలో మోదీ సంకల్పపత్ర్ జత చేసి సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ఉపాధి కల్పనకు పెద్దపీట వేయడమే తమ కూటమి లక్ష్యమని చెప్పారు. ఆర్థికంగా, అభివృద్ధి పరంగా గాడితప్పిన రాష్ట్రాన్ని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పునఃనిర్మాణం చేపడతారని అన్నారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ప్రతి చెరువుకు నీరుతెచ్చి ప్రతి ఎకరా సాగులోకి తీసుకువస్తామన్నారు. పార్లమెంట్ నియోజక పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకువచ్చి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలబెడతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఆంక్షలు లేని సంక్షేమం, అభివృద్ధి నిలయంగా పార్లమెంట్ నియోజకవర్గాన్ని చేస్తానని అన్నారు. యువత వారి కాళ్లపై వారు నిలబడే విధంగా నియోజక వర్గాల వారిగా నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు చూపించి నిరుద్యోగిత తగ్గించడానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర రాష్ట్రాల సాయంతో యువతకు ఉపాధి, మహిళలకు సాధికారిత సాధించేలా కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను ప్రజలు బలపరిచి అఖండ మోజార్టీని ఇవ్వాలని విన్నవించారు. బీకే ప్రచారంలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు.



పెనుకొండ నియోజకవర్గం మల్లాపల్లిలో బీకే ప్రచారం

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మందకృష్ణ మాదిగ

అనంతపురం అర్బన్, మే 6: టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో మాదిగలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఏపీని రాజధానిలేని రాష్ట్రంగా జగన్ మార్చారని విమర్శించారు. ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జగన్ మాటలను నమ్మొద్దు: అంబికా

జగన్ మాటలు నమ్మి మోసపోవద్దని టీడీపీ కూటమి అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ దళిత ఓటర్లను కోరారు. గత ఎన్నికల్లో ఓట్లు వేసిన పాపానికి దళితులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. దళిత ద్రోహి జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే దళితులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

- జగన్ ప్రభుత్వంలో దళితులే ఎక్కువగా నష్టపోయారని ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. ఐదేళ్లల్లో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలతో వైసీపీవారు పేట్రేగిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. మాదిగలు జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే జిల్లాలవారీగా వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, కదిరప్ప, నాగార్జున, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, రాయల్ మురళి, వెంకటేష్, శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

జన కేతనం
ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
మంగళవారం 7 మే 2024

మీది గూగుల్‌పేనా.. ఫోన్‌పేనా..?

రాను, పోను ఖర్చులు మావే..
వలస ఓటర్లపై పార్టీల దృష్టి



కదిరి అర్బన్, మే 6: ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. ఒక్క ఓటుతోనే ఓడిన, గెలిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అందుకే గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి ఉద్యోగ, ఉపాధి పొందుతున్న వలస ఓటర్లపై రాజకీయ పార్టీల కన్నుపడింది. వారిని స్వగ్రామాలకు రప్పించి తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు ఆయా పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. రాను పోను ఖర్చులు మావేనని, ఆపై రోజంతా ఖర్చు తమదేనంటూ ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. ఇక్కడి బంధువులు, కుటుంబ సభ్యుల ద్వారా వలస వెళ్లినవారి ఫోన్ నెంబర్లు సేకరించి మాట్లాడుతూ గ్రామాలకు వచ్చి తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆయా ఫోన్ నెంబర్లకు ఫోన్‌పే, గూగూల్ పే ఉందా అని ఆరా తీసున్నారు. పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండడం, ప్రతి ఓటు ముఖ్యమైనది కావడంతో పనిలో పనిగా డబ్బులు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లిస్తూ ఓటర్లను ఆకట్టుకున్నట్లు చర్చలు జరుగుతున్నాయి.

గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి



పూర్వపు నల్లమాడ, ప్రస్తుత పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులయ్యారు. కానీ ఉపాధి అవకాశాలు మాత్రం కల్పించలేకపోయారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి దొరుకుతుంది. ఇక్కడ పనులు లేకపోవడంతో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వసలువెళ్లి జీవనం సాగిస్తున్నారు. ప్రమాదాల్లో ఎంతోమంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఒక గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం కూలీలు వలసలు పోకుండా స్థానికంగా పనులు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎన్నికల సమయంలో నాయకులు తాము గెలిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారే కానీ ఎవరూ నెరవేర్చలేదు. ఈసారి గెలిచే అభ్యర్థి అయినా పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు నివారించాలి.

- రహంతుల్లా, నల్లమాడ

అభివృద్ధికే తొలి ఓటు

ప్రభుత్వ నిర్మాణంలో ఓటు కీలకం. అత్యంత శక్తివంతం. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించగల పార్టీకే తమ ఓటు అనీ, అభివృద్ధి చేసేవారికే తొలి ఓటు వేయనున్నట్లు కొత్తగా ఓటు హక్కు పొందిన యువత పేర్కొన్నారు.

- కదిరి అర్బన్

నిజాయితీగా ఉంటేనే అభివృద్ధి



మనం ఎన్నుకునే నాయకులు నిజాయితీగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. నాకు తొలిసారి ఓటు హక్కు రావడం గర్వంగా ఉంది. ప్రతి ఓటరు కూడా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును సద్విని యోగం చేసుకుంటే అభివృద్ధిపై నాయకులను నిర్భయంగా ప్రశ్నించవచ్చు. ఎన్నికల సమయంలో వచ్చి తరువాత కనిపించకుండాపోయే నాయకులను ఎన్నుకోవడం వృథా.

- గిరీష్, ఎగువపల్లి, కదిరి మండలం

ఆలోచించి ఓటు వేయాలి



ఓటు వేసేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి వేయాలి. మన భవిష్యత్ ఎలా ఉండాలన్నది మనం వేసే ఓటుపైనే ఆధారపడి ఉంటుంది. పార్టీలకోసం డబ్బుకోసం కాకుండా నాయకుడి గుణగణాలను, నిజాయితీని పరిగణనలోకి తీసుకుని ఓటు వేస్తే బాగుటుందనేది నాఅభిప్రాయం. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నదుకు ఆనందంగా ఉంది.

- దేవేంద్ర, ఎగువపల్లి, కదిరి మండలం

ఓటు.. వజ్రాయుధం



ప్రలోభాలు ఆశ చూసి, ఓటువేయించుకోవాలనే నాయకులను ఎట్టి పరిస్థితిలో నమ్మను. వారికి నా తొలి ఓటు వేయను. ఓటు హక్కు వజ్రాయుధలాంటింది. నిజాయితీగా ఓటు వేస్తే, మనకు కావలసిన అభివృద్ధి పనుల గురించి ఎన్నికైన ఎమ్మెల్యేలను ధైర్యంగా అడిగే అవకాశముంటుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వేయడం కీలక పరిణామంగా భావిస్తున్నా.

- మహేష్, కె. కుంట్లపల్లి, కదిరి మండలం

ఉద్యోగాలు కల్పించే వారికే ఓటు



ఉద్యోగావకాశాలు కల్పించడానికి కృషి చేసేవారికే నా మొదటి ఓటు వేస్తా. చదువుకున్నయువతకు కావల్సింది ఉద్యోగమే. కావున అందుకు కృషి చేసేవారికే అవకాశం ఇవ్వాలి. మొదటిసారి ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. పోలింగ్ తేదీ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నా.

- రాజేష్, కె. కుంట్లపల్లి, కదిరి మండలం

నిస్వార్థంగా సేవ చేసే వారికే..



భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, ప్రలోభాలకు లొంగకుండా రాజ్యాంగానికి కట్టుబడి రాష్ట్రాభివృద్ధికి పనిచేసే నాయకున్ని, ఎన్నుకునేందుకు నా ఓటు హక్కును వినియోగించుకుంటా. ప్రతి ఒక్కరు నిజాయితీ పరులకు ఓటు వేసి గెలిపించాలి.

- గణేష్, కాళసముద్రం, కదిరి మండలం

ప్రచారానికి ప్రార్థనా మందిరాలు ఉపయోగించకూడదు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 6: ఎన్నికల ప్రచారానికి ఎలాంటి ప్రార్థనామందిరాలను ఉపయోగించకూడదు. ప్రచారానికి వేదికలుగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ప్రార్థనా మందిరాలను వినియోగించకూడదు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆయా ప్రార్థనా మందిరాలకు సంబంధించిన శాఖల అధికారులు హెచ్చరికలతో కూడిన నోటీసులు ఇస్తారు. అదే విధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభల నిర్వహణకు మైదానాల కేటాయింపు విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికార పార్టీతో పాటు ఇతర అన్ని పార్టీలకు సమానంగా మైదానాలను కేటాయించాల్సి ఉంటుంది. హెలిప్యాడ్‌ల వినియోగంలోనూ అన్ని పార్టీలకు ఈ నిబంధన వర్తిస్తుంది.

నీళ్లు ఇచ్చే నాయకుడేడీ..?

ఎండిపోయిన చీనీ చెట్టు



ఐదెకరాల్లో చీనీచెట్లు ఎండిపోయాయి



బోర్లలో నీరు రాకపోవడంతో నీటితడులు అందించలేక ఐదెకరాల్లో సాగుచేసిన చీనీపంట నిట్టనిలువునా ఎండిపోయింది. సుమారు ఏడేళ్ల వయస్సు ఉన్న చీనీచెట్లు పూర్తిగా ఎండిపోవడంతో తొలగించాల్సి వచ్చింది. మరికొన్నిచీనీచెట్లను పైపులైను ద్వారా నీటిని చిలమకూరు ఏటి నుంచి తరలిస్తూ బతికించుకుంటున్నాం. ఇప్పటికే పైపులైను మరమ్మతుల కోసం రూ.5లక్షల మేర ఖర్చుచేశాను. నాలాంటి రైతులు చాలామంది ప్రత్యామ్నాయంగా ఏటిప్రాంతం నుంచి పైపుల ద్వారా నీటి సరఫరా చేసుకుంటూ చెట్లను బతికించుకుంటున్నారు.

- రామానాయుడు, రైతు, కోమటికుంట్ల

శాశ్వత పరిష్కారం చూపే నాథుడే లేడు



పదేళ్ల కిందట కరువు విలయతాండవం చేస్తున్న సమయంలో చెట్లు ఎండిపోవడంతో పెంచిన చేతులతోనే నరికేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ ఏడాది కూడా తీవ్ర వర్షాభావంతో చెరువులో నీరు లేక భూగర్భజలాలు అడుగంటాయి. 1200నుంచి 1500అడుగుల మేర బోర్లు వేస్తున్నా నీటిజాడ కనిపించడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే నాథుడే లేరు. ఐదేళ్ల కిందట ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పైపులైను ద్వారా గండికోట నుంచి నీరు తెస్తామని ఇచ్చిన హామీ నీటిమూటగా మారింది.

- భాస్కర్‌నాయుడు, రైతు, కోమటికుంట్ల

మూడు చెరువులకు హెచ్చెల్సీ నీరు హుళక్కే..
వర్షాలతో రెండేళ్లపాటు చెరువులు నిండిన వైనం
ఈ ఏడాది హెచ్చెల్సీ నీరు రాక ఎండిపోయిన చెరువులు
పంటలను కాపాడుకునేందుకు శ్రమిస్తున్న రైతులు

పుట్లూరు: హెచ్చెల్సీ నీటితో మండలంలోని మూడు చెరువులను నింపుతామన్న పాలకుల మాట నీటి మూటగా మరింది. మండలంలో పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లోని మూడు చెరువులు నిండితే ఇక్కడ కరువుకు చోటుండదు. ఈ ఏడాది హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో మండలంలోని మూడు చెరువులు ఎండిపోయాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయి పంటపొలాలు ఎండిపోతున్నాయి. ఈ ఐదేళ్లలో రెండేళ్లపాటు వర్షాలు సమృద్ధిగా రావడంతో మూడుచెరువులు నిండాయి. మరో ఏడాది మాత్రం అడపాదడపా అరకొరగా హెచ్చెల్సీ నీరు రావడంతో కొద్దిమేర చెరువులు నిండాయి. కానీ ఈ ఏడాది పూర్తిగా రాకపోవడంతో తాగునీటి సమస్య కూడా తలెత్తుతోంది. 2019 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే మూడుచెరువులు హెచ్చెల్సీ నీటితో నింపుతామంటూ వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత ఇటువైపు కూడా కన్నెత్తి చూడలేదనే విమర్శలు ఉన్నాయి.




నీటికోసం పైప్‌లైను వేస్తున్న దృశ్యం

ఎండుతున్న ఉద్యాన పంటలు

నీరు రాకపోవడంతో చెరువుల కింద సాగుచేసిన ఉద్యాన పంటలు ఎండి పోతున్నాయి. చీనీ, అరటి, దానిమ్మ తదితర పంటలు ఎండిపోయి రైతులకు కన్నీటిని మిగులుస్తున్నాయి. బోర్లలో నీరు అడుగంటిపోవడంతో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేసిన రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలో ఇప్పటికే వంద ఎకరాలకు పైగా చీనీ, 80ఎకరాలకు పైగా దానిమ్మ పంటలను బోర్లలో నీరు రాకపోవడంతో తొలగించారు. కాగా యల్లనూరు మండలం చిలమకూరు ఏటి నుంచి కోమటికుంట్ల గ్రామానికి కొందరు రైతులు 11 కిలోమీటర్ల మేర పైపలైన్ వేసి నీటిని తరలిస్తూ చీనీచెట్లను కాపాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే పాలకులు హామీలు ఇస్తారే తప్ప నెరవేర్చరనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పవరు లేని పదవులు..!



వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాలుగా ప్రజాప్రతినిధులు
మూడేళ్లు గడిచినా నిధుల్లేవు.. విధుల్లేవు..

చిలమత్తూరు: గ్రామీణ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల్లో గెలిచిన స్థానిక ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయం జరిగింది. తమ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్న వారి ఆశలపై వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఎన్నికై మూడేళ్లు కావస్తున్నా నిధులు....విధులూ లేకపోవడంతో ఆ పార్టీలోని ప్రజాప్రతినిధిలే తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందనుకుంటే అదీ లేకుండాపోయింది. దీంతో విజయం సాధించామన్న సంతోషం కంటే.. ప్రజలకు ఏమీచేయలేకపోతున్నామనే బాధే వారిలో ఎక్కువగా కనపడుతోంది. 2021 ఫిబ్రవరి 21న పంచాయతీలకు, అదే ఏడాది ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో చిలమత్తూరు మండలంలోని 12 పంచాయతీలకు 11 పంచాయతీలు, 15 ఎంపీటీసీ స్థానాలకు 15 ఎంపీటీసీ స్థానాలను అధికార పార్టీ దక్కించుకుంది.

నిధులు లేవు.. విధులూ లేవు

గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్లవుతున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయారు. నిధులు లేవు... విధులు లేవు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పని లేకుండా పోయింది. ప్రతీది వారి ద్వారా జరుగుతుండటంతో పంచాయతీ కార్యాలయాల్లో దిష్టిబొమ్మలా కూర్చోవడం తప్పా చేసేదేమి లేదని పలువురు పేర్కొంటున్నారు. ఎంపీటీసీల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. వారికి విధులు లేవూ...నిధులూ లేవు. కనీసం పంచాయతీ కార్యాలయంలో కూర్చుందామంటే వారికి ప్రత్యేకమైన కుర్చీ కూడా లేదు. మండల పరిషత్ సమావేశాల్లో ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిష్కరించిన దాఖలాలు లేవు. నిధుల జాడ లేక ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు.

నిధుల కోసం వినతులు

ఏదో రకంగా హామీలను నిలబెట్టుకొని ప్రజల్లో గౌరవం పొందాలనుకున్న ఎంపీటీసీలకు వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా నిరాశే ఎదురవుతోంది. గ్రామాల్లో వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వినతులు ఇస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. కనీసం సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేద్దామన్నా నిధుల లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మండల పరిషత్‌కు పెద్దగా నిధులు మంజూరు కాకపోవడం, సాధారణ నిధులు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో వారు ఏ పని చేయలేకపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపీటీసీలకు కొంత వరకు నిధులు కేటాయించడంతో కొన్ని పనులు చేశారు. వైసీపీ హయాంలో ఎంపీటీసీలకు ఒక్కపైసా విదల్చక పోవడంతో ఆవేదనకు గురవుతున్నారు.



పదవి ఉన్నా.. లేనట్లే..

మండల పరిషత్‌కు గతంలో బీఆర్‌జీఎఫ్ తలసరి గ్రాంట్, జనరల్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, 14వ ఆర్థిక సంఘం నిధులు సమకూరేవి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేవారు. ప్రస్తుతం నిధులు ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచాయతీలకు ఇస్తుండటంతో వారికి కనీస గౌరవం కూడా లేకుండా పోయింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 20 శాతం ఎంపీటీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా రాష్ట్రం ఇవ్వడం లేదు. ఎంపీటీసీలకు నిధుల వాటా 25 శాతం పెంచాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ విడుదల చేయడం లేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో సర్పంచులు, ఎంపీటీసీలు పదవి ఉన్నా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

మౌనమే మేలు..!



ఇటీవల ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్ వేటు
ఈసీ చర్యలతో సంఘాల నేతల వెనకడుగు

అనంతపురం విద్య: ఎన్నికల వేళ... మెజార్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గొంతు విప్పేందుకు జంకుతున్నారు. గతంలో చిన్న సమస్య అయినా పదే పదే స్పందించే నాయకులు ఇప్పుడు ఏమి మాట్లాడాలన్నా ఆలోస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అనుకూలంగా మాట్లాడాలన్నా ఉపాధ్యాయ సంఘాల నాయకులు భయపడుతున్నారు. ఇటీవల ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు హరికృష్ణ, విజయ్‌భాస్కర్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై గళం విప్పారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఎలాంటి విచారణ లేకుండానే జిల్లా విద్యాశాఖాధికారులు ఆ ఇద్దరు సంఘాల నాయకులను గత నెల 20న సస్పెండ్ చేశారు. ఈ అంశం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తర్వాత వైఎస్ఆర్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేశారంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఈసీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇటీవల అశోక్‌కుమార్‌రెడ్డిని జిల్లా విద్యాశాఖాధికారులు సస్పెండ్ చేశారు. ఈ రెండు సంఘటనలతో ఉపాధ్యాయులు, సంఘాల నాయకుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఏమాత్రం పెదవి విప్పినా మనకే చేటు అంటూ గుసగుసలాడుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడినా.. ప్రభుత్వానికి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినా ఈసీకి ఫిర్యాదులు వెళ్లిన వెంటనే... జిల్లా విద్యాశాఖాధికారులు వేటు వేస్తున్నారని, మనకెందుకు మౌనంగా ఉండటమే మేలు అన్న ధోరణిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

నాడు ఉద్యానం.. నేడు అధ్వానం



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారులు (ఫైల్)

వైసీపీ పాలనలో ఉద్యాన పంటలకు అందని ప్రోత్సాహం
రైతులకు అందని బిందు, తుంపర సేద్యపరికరాలు
ఉద్యాన పంటలకు అధిక ప్రోత్సాహమిచ్చిన టీడీపీ ప్రభుత్వం

పుట్టపర్తి రూరల్: వైసీపీ పాలనలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఊసే లేకుండాపోయింది. జిల్లాలో 66 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. టీడీపీ హయాంలో ప్రతి ఏడాది రూ. వందల కోట్లలో పోత్సహకాలు రైతులకు అందేవి. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రైతులకు నయాపైసా అందలేదు. జిల్లాలో రూ.8.85 కోట్ల ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రోత్సాహకాల వివరాలను అధికారులంతా అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు కానీ ప్రభుత్వం రైతులకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు టీడీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సాహకాలు అందించేది. ప్రస్తు ప్రభుత్వం అలాంటి వాటిని పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటను బట్టి ప్రోత్సాహకాలు అందిస్తారు.

- కొత్తగా మామిడి సాగుచేసుకునే రైతుకు ఒక హెక్టారుకు ఏడాదికి రూ 13300 చొప్పున మూడేళ్ల పాటు అందించేవారు
- హెక్టారులో సాగు చేసిన జామకు ఏడాదికి రూ.29వేలు, దానిమ్మకు రూ.27వేలు మూడేళ్ల పాటు చెల్లించేవారు
- అరటికి హెక్టారుకు రూ.43వేలు, బొప్పాయికి రూ.23 వేలు పంపిణీ చేసేవారు
- బంతి, చామంతి, రోజా, వంటి పూలతోటలసాగుకు హెక్టారుకు రూ. 16 వేలు ఒకసారి అందించేవారు.
- మల్చింగ్ విధానంలో ఏపంట సాగు చేసినా హెక్టారుకు రూ.16వేలు అందించేవారు. ప్రస్తుతం మల్చింగ్ విధానం అమలు కావడంలేదు
- టమోటా సాగులో కర్రలు, ఊతం ఇచ్చేందుకు హెక్టారుకు రూ.18750 ఒక సారి ఇచ్చేవారు. ప్రస్తుతం లేదు
- మూడు మీటర్ల లోతు, 20 మీటర్ల పొడవు, వెడల్పుతో రైతులు ఫారంపాండ్స్ తవ్వుకుంటే రూ.75వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ ఊసే లేదు.
- ఉద్యాన ఉత్పత్తుల కేంద్రాన్ని ప్యాక్‌హౌస్ 20ఇంటూ 30 ప్రకారం నిర్మించుకుంటే, రూ. నాలుగు లక్షల యూనిట్ కాస్ట్ ఉంటే రూ.రెండు లక్షల ప్రోత్సాహకాన్ని అందించేవారు.

కానరాని బిందుసేద్యం

బిందు, తుంపర్ల సేద్యాలకు చంద్రబాబు హయాంలో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిని పట్టించుకోవడం మానేశారు. తుంపర్ల సేద్యం యంత్రాలకు సంబంధించిన బకాయిలు వివిధ కంపెనీల కు చెల్లించకపోవడంతో పథకం ఆగిపోయింది. గడచిన మూడేళ్లలో ఈ పథకాలకు వైసీపీ ప్రభుత్వం నిధులు ఏమాత్రం మంజూరు చేయలేదు.



మామిడితోట

ఉద్యోగులు మొహం మీద ఉమ్మేసినా.. సిగ్గులేదా..!

● వారి ఓట్లను కొనాలని చూస్తారా? ● వైసీపీ నేతలపై కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఫైర్
● ఐదేళ్ల వైసీపీ పాలన అధ్వానం ● కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ





ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, చంద్రబాబును కలిసిన దగ్గుబాటి ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు

అనంతపురంరూరల్, మే 6: ఉద్యోగులు వైసీపీ నాయకుల మొహం మీద ఉమ్మేసినా.. వారికి సిగ్గు లేకుండా పోయిందని కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం రాణినగర్‌ప్రాంతాల్లో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగుల ఓట్ల కోసం వైసీపీ నాయకులు చీప్ ట్రిక్స్ ప్లే చేస్తోందన్నారు. వారి ఓట్లను కొనుగోలు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులు వైసీపీపై ఎంతో మండిపడుతున్నారని, అయినా సిగ్గు లేకుండా వారి ఓటును డబ్బుతో కొనాలని చూస్తున్నారన్నారు. ఇలాంటి వారిని ఏమనాల్లో అర్థం కావడం లేదన్నారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమైందన్నారు. వారి వెంట మాజీ మేయర్ స్వరూపా, మాజీ కార్పొరేటర్లు గుర్రం నాగభూషణం, నాయకులు రంగా, కంతాదేవి, లింగారెడ్డి, సుంకన్న, బీజేపీ నాయకులు అమర్, జనసేన నాయకులు ఇమామ్, హుస్సేన్ ఉన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భారీ కుట్ర

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల భూములకు సీఎం జగన్ ఎసరు పెట్టారని, వారి భూములు కాజేసేందుకే ఈ యాక్ట్‌తో భారీ కుట్ర పన్నారని దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ధ్వజమెత్తారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఈ యాక్టు అమలుకు జగన్ ఎందుకు అంత తొందరప డుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. జగన్‌కు ఓటు వేయడ మంటే.. మన భూ హక్కులను వైసీపీ నాయకులకు అప్పగించడమేనని అన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించుకొని ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ పాల్గొన్నారు.

దగ్గుబాటి శ్రీలక్ష్మికి చంద్రబాబు ప్రశంస

కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ సతీమణి దగ్గుబాటి శ్రీ లక్ష్మిని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. సోమవారం ఉదయం నగర శివారు కక్కలపల్లి సమీపంలోని ఆర్ కన్వెషన్ హాల్‌లో దగ్గుబాటి ప్రసాద్ తన భార్య, కుటుంబ సభ్యులతో చంద్రబాబును కలిశారు. అనంత అర్బన్‌లో తన భర్తతోపాటు దగ్గుబాటి శ్రీ లక్ష్మి ఎండను లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్న తీరుపై చంద్రబాబు ఆమెను అభినందించారు.



పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

సొంత గ్రామాన్నే పట్టించుకోని తోపు

కూటమి అభ్యర్థి పరిటాల సునీత

ఆత్మకూరు, మే 6 : సొంత గ్రామం లోని సమస్యలనే పట్టించుకొని అసమర్థ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అని, కనీసం ఆ గ్రామానికి రోడ్డు కూడా వేయలేదని, ఇక నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేస్తారని రాప్తాడు కూటమి అభ్యర్థి పరిటాల సునీత మండిపడ్డారు. సోమవారం మండలంలోని బి యాలేరు, మదిగుబ్బ, తండా, రంగంపేట, సనప, వేపచెర్ల ఎగువ తండా, దిగువ తండా గ్రామాల్లో కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథితో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. తోపు బ్రదర్స్ ప్రజలనే కాక సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలను దోచుకొని.. జేబులు నింపుకున్నారన్నారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల్లోపు వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. తోపు హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లానాయకులు మల్లికార్జున రెడ్డి, బిల్లే ఈశ్వరయ్య, నారాయణస్వామి, పరుశురామ్, క్రిష్ణమోహన్ చౌదరి పాల్గొన్నారు.

ప్రకాష్ ఓటమి కోసం ఎదురుచూస్తున్న వైసీపీ నేతలు

అనంతపురంరూరల్ : రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఓటమి కోసం వైసీపీ నాయకులే ఎదురుచూస్తున్నారని పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం వెంకటాపురం క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామం నుంచి 15 కుటుంబాలు, కనగానపల్లి మండలం మద్దలచెరువు గ్రామం నుంచి 10 కుటుంబాలు, ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామం నుంచి 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అనంతపురం క్యాంపు కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ సమక్షంలో కనగానపల్లి, తగరకుంట, తల్లిమడుగుల, బాలేపాళ్యం, అనంతపురం రూరల్ నుంచి 20 కుటుంబాలు, ధర్మవరం టీడీపీ కార్యాలయంలో చెన్నేకొత్తపల్లి మండలం ఆముదాలకుంట గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు, పరిటాల సిద్ధార్థ సమక్షంలో కనగానపల్లి మండల పాత పాళ్యం, రాప్తాడు మండలం రామినేపల్లి, అనంతపురం రూరల్ పాపంపేట నుంచి 25 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.

జోరుగా కుటుంబ సభ్యుల ప్రచారం

అనంతపురంరూరల్ : మండలంలోని పాపంపేట పంచాయతీ విద్యారణ్యనగర్‌లో పరిటాల కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. సిండికేట్ నగర్‌లో పరిటాల శీన స్థానిక నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. **చెన్నేకొత్తపల్లి :** మండలంలోని మేడాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు కొండకింద మారుతి నగర్‌కు చెందిన మురగన్ అనిల్‌కుమార్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. అతను అదే నగర్‌కు చెందిన ఏడేళ్ల చిన్నారిపై ఆదివారం లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి గట్టిగా కేకలు వేయడంతో అతను పారిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

ఆస్పత్రి తనిఖీ

అనంతపురం టౌన్ : స్థానిక పాతూరులోని సీడీ ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సరళమ్మ సోమవారం తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది, రోగుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. రికార్డు లను పరిశీలించారు. రోగుల కేషీట్స్‌ను పరిశీ లించారు. ఆమె వెంట జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి రవికుమార్ ఉన్నారు.

హోమ్ ఓటింగ్‌ను వేగంగా చేపట్టాలి

అనంతపురంరూరల్ : హోమ్ ఓటింగ్ ప్రక్రియను వేగంగా చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం మండలంలోని కురుగుంట సమీపంలోని అన్నె ఫెర్రర్ కాలనీలో హోమ్ ఓటింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. మండలంలో 39 మంది హోమ్ ఓటర్లు ఉండగా.. ఇప్పటి వరకు 11మంది చేత పూర్తిచేయించినట్లు అధికారులు వివరించారు.

ఏపీ ఐసెట్‌కు 44,446 మంది హాజరు

అనంతపురం సెంట్రల్ : ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకోసం నిర్వహించిన ఏపీ ఐసెట్-2024 ఆన్‌లైన్ పరీక్షలకు 44,446 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏపీ, తెలంగాణలోని 113 కేంద్రాల్లో సోమవారం పరీక్షలు నిర్వహించారు. సెట్ నిర్వాహక కమిటీ ఛైర్మన్, అనంతపురం ఎస్కే యూనివర్సిటీ వీసీ హుస్సేన్‌రెడ్డి, కన్వీనర్ మురళీకృష్ణ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ పరీక్షకు 48,828 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 44,446 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరు 91 శాత నమోదైందని తెలిపారు. ప్రిలిమినీ ఆన్సర్ కీని త్వరలో విడుదలచేస్తామని తెలిపారు.

రేపు ఏపీ ఈసెట్

డిప్లమో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలను కల్పించేందుకు ఏపీ ఈసెట్-2024 పరీక్షలు బుధవారం జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ పరిధిలో మొత్తం 37,767 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని సెట్ నిర్వాహక కమిటీ ఛైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల పరిధిలో మొత్తం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.హైదరాబాదులో రెండు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఉదయం 9 తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో సెషన్ పరీక్షలు ప్రారంభమౌతాయని, గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

కోలుకోని బండారు శ్రావణిశ్రీ

శింగనమల మే 6: కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ వడదెబ్బ నుంచి ఇంకా కోలుకోలేదు. శనివారం రాత్రి వడదెబ్బతో ఆమె తీవ్ర అస్వస్థత గురైన విషయం తెల్సిందే. ఆదివారం, సోమవారం తన ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. సోమవారం బండారు శ్రావణిశ్రీని కూటమి అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరణ్, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాశ్ నాయుడు, పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన నాయకులు ఆమెను పరామర్శించారు.



శ్రావణిశ్రీని పరామర్శిస్తున్న అంబికా లక్ష్మీనారాయణ

కోలుకోవాలని పూజలు

వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైన బండారు శ్రావణిశ్రీ త్వరగా కోలుకోవాలని అభిమానులు సోమవారం పూజలు నిర్వహించారు. శింగనమల చిన్నకాలువ శివాలయంలో గోవింద రాయునిపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్డే సూరి ఆధ్యర్యంలో స్వామివా రికి 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు అంజినప్ప ఆర్మీ సురేష్, రాముడు, సునీల్, వెంకటపతి పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘన వీడ్కోలు

అనంతపురం అర్బన్, మే 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు జిల్లా టీడీపీ నాయ కులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి అనంతపురం నగరశివారులోని కక్కలపల్లి సమీపంలోని ఆర్ కన్వెక్షన్ హాల్‌లో ఆయన బస చేశారు. సోమవారం ఉదయం ఇక్కడి నుంచి నంద్యాల జిల్లాలో జరిగే ప్రజాగళం సభకు హాజరయ్యేందుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో వెళ్లారు. పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్, మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ చంద్రబాబుకు వీడ్కోలు పలికారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గార్లదిన్నె, మే 6: మండలంలోని ఎగువపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన కిష్టప్ప (55) మరణించాడు. కిష్టప్ప గార్లదిన్నెలో ఉన్న తన కూతురు ఇంటికి వచ్చాడు. ఆదివారం బైక్‌లో కల్లూరు నుంచి గార్లదిన్నెకు బయలుదేరాడు. ఎగువపల్లికి చెందిన నరేంద్ర ముంటిమడుగు నుంచి ఎగువపల్లికి బైక్‌లో బయలుదేరాడు. వీరి వాహనాలు ఎదురెదురుగా ఎగువపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ కిష్టప్పను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

రామగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని ఏడుగుర్రాలపల్లి గ్రామానికి చెందిన అంజినప్ప (55) మరణించాడు. అంజినప్ప ఆదివారం రాత్రి బొలెరో వాహనంలో తన గ్రామానికి బయలు దేరారు. మర్గమధ్యలో వాహనం అదుపుతప్పడంతో.. వాహనం వెనుక ఉన్న అంజినప్ప కింద పడ్డాడు. స్థానికులు అతన్ని పేరూరు ఆస్పత్రికి తరలించి అక్కడ ప్రథమ చికిత్సలు చేయించారు. అనంతరం అతన్ని ఇంటికి తీసుకువచ్చారు. కొద్దిసేపటికే ఆయన మరణించాడు. ఆయన కుమార్తె రామాంజినమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల కోడ్ ఉండగా... పోస్టు భర్తీ ..!

అనంతపురం విద్య, మే 6 : అనంతపురం సమగ్ర శిక్ష ప్రాజక్టులోని ఒక ఉన్నతాధికారి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా... బుక్కరాయసముద్రం మండలంలోని ట్రైనింగ్ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి ఒక మహిళను నియమించే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండానే నెల రోజుల నుంచి ఆ మహిళతో పనులు కూడా చేయించుకుంటున్నాడు. అనంతపురం జిల్లాలో ఎవరూ లేన్నట్టుగా... ఏకంగా కర్నూలు జిల్లాకు చెందిన ఆ మహిళతో పోస్టును భర్తీ చేసేందుకు ఎత్తులు వేసినట్టు తెలుస్తోంది. కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న ప్రాజక్టులో సైతం ఇలా అడ్డగోలు వ్యవహారాలు నిర్వహిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది.



విధులు నిర్వహిస్తున్న మహిళ



9లోగా ప్రవేశాలు నిర్ధారించుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 6: అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలను నిర్ధారించుకోవాలని అంబేడ్కర్ గురుకుల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థుల మార్కుల ఆధారంగా రాష్ట్ర అధికారులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 720 సీట్లకు 720 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 400 సీట్లకు 400 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. దరఖాస్తు సమయంలో ఎంపిక చేసుకున్న ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లను సందర్శించి సంబంధిత పత్రాలతో ఈనెల 9లోగా ప్రవేశాలను నిర్ధారణ చేసుకోవాలని పేర్కొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్, వలంటీర్లు

అనంతపురం రూరల్: మండలంలోని కురుగుంట గ్రామం ఆదివారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీరులు సౌజన్య, వసుంధర, వాసవి, ఎండీయూ వాహన ఆపరేటర్ ముస్తాఫా పాల్గొన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వీరు ప్రచారంలో పాల్గొనడం పలు విమర్శలకు తావిస్తోంది.



ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్



మార్కెట్‌లోకి మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ



కారును విడుదల చేస్తున్న సీఈఓ తదితరులు

అనంతపురంరూరల్ : ఎంజీబీ మొబైల్స్, మహీంద్రా షోరూం అనంతపురం వారి అధ్వర్యంలో కంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓను హైవేలోని షోరూంలో మార్కెట్‌లోకి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్య మాచాని మాట్లాడుతూ.. కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ మహీంద్రా వాహనం అత్యాధునిక టెక్నాలజీ, సౌకర్యవంతమైన డిజైన్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు. అద్భుతమైన పెర్‌ఫార్మెన్స్, సాటిలేని సురక్షతను కలిగి బెంచ్ మార్క్‌ను ఏర్పరచిందన్నారు. వాహనం ఎక్స్ షోరూమ్ ధర రూ.7.49 లక్షలతో ప్రారంభమవుతుందని, ఎనిమిది రంగుల్లో ఈ వాహనం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ ఏరియా సేల్స్ మేనేజర్ అజిన్, జనరల్ మేనేజర్ సేల్స్ వంశీ కృష్ణ, సేల్స్ మేనేజర్ మస్తాన్ వలీఖాన్ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు



అనంతపురం అర్బన్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరి కీ చోటు దక్కింది. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు జాబితా విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొండవీటి భావన, రాష్ట్ర కార్యదర్శిగా రాయల్ మురళీమోహన్ నియమి తులయ్యారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె : మండలంలోని మర్తాడులో నివాసముంటున్న ఖాశీంపీరా (46) ఆత్మహత్య చేసుకున్నాడు. అతను కూలీపనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతనికి భార్య షాభిరా, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.



FORMAT C-1

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble supreme court in W.P.(Civil) No. 536 of 2011 (Public interest foundation & ors.Vs. Union of India & Anr.)

Name and address of Candidate: BANDARU SRAVANI SREE, D.NO.3-25, Siddarampuram (V), Bukkarayasamudram (M), ANANTAPURMU DISTRICT, A.P.

Name of Political Party: TELUGU DESAM PARTY
(Independent candiates should write "Independent" here)

Name of Election: LEGISLATIVE ASSEMBLY

Name of Constituency: 152-SINGANAMALA (S.C) ASSEMBLY CONSTITUENCY

I, BANDARU SRAVANI SREE (Name of Candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents.

(A) Pending Criminal Cases

Sl. NO.	Name of Court	Case No. AND Date	Status of the Case(s)	Section(s) of Acts Concerned and brief description of offence(s)
1.	Not Applicable	Not Applicable	Not Applicable	U/S 151 CRPC Prevention of committing any cognizable offence
2.	Not Applicable	Not Applicable	Not Applicable	U/S 151 CRPC Prevention of committing any cognizable offence
3.	Not Applicable	Not Applicable	Not Applicable	U/S 151 CRPC Prevention of committing any cognizable offence
4.	Not Applicable	Not Applicable	Not Applicable	U/S 151 CRPC Prevention of committing any cognizable offence

(B) Details About cases of conviction of criminal offences

S.No	Name of Court & Date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment imposed
1.	Not Applicable	Not Applicable	Not Applicable
2	Not Applicable	Not Applicable	Not Applicable
3.	Not Applicable	Not Applicable	Not Applicable
4.	Not Applicable	Not Applicable	Not Applicable

* In the Case of Election to Council of States or Election to Legislative Council by MLA's, mention the election concerned in place of name of constituency.

Sd/- BANDARU SRAVANI SREE
CANDIDATE OF TELUGU DESAM PARTY,
152 SINGANAMALA (S.C) ASSEMBLY CONSTITUENCY.


గడేహోతూరు రోడ్‌షోలో పయ్యావుల


కేశవ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ వార్డు సభ్యులు

పదవుల కోసమే పార్టీలు మారిన విశ్వ

● టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 6: స్వార్థ రాజకీయాలు, పదవుల కోసం వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి పార్టీలు మారారని, ప్రజలకు చేసిందేమీలేదని టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. నియోజకవర్గంలోని వెలిగొండ, చిన్నహోతూరు, పెద్దహోతూరు, కొనకొండ్ల గ్రామాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాలలో కేశవ్‌కు మహిళలు హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. వెలిగొండ గ్రామంలో ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహించారు. 30 రోజులకు ఒక్కసారి నీళ్లు వస్తున్నాయని కేశవ్ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి పొత్తుతో మీ ముందుకు వస్తున్నామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ రూపకర్త ఎన్టీఆర్ అన్నారు. రేయింబవళ్లు పనిచేసి కాలువలకు నీరు ఇచ్చామన్నారు. తవ్విన కాలువలకు సాగునీరు ఇవ్వలేని అసమర్థుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఐదేళ్లలో హంద్రీనీవా కాలువలో తట్టెడు మట్టి అయినా తీయలేదన్నారు. వైసీపీ నాయకులు మట్టిని దోచేసి, అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. వెలిగొండలో కాలనీకి నీళ్లు అడిగినందుకు దళితులపై దాడి చేశారన్నారు. ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వనందుకు వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భూములను లాక్కునేందుకు వైసీపీ ప్రభుత్వం చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. బీసీల పార్టీ టీడీపీనే అన్నారు. ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేగాటి నాగరాజు, మండల కన్వీనర్లు నూతేటి వెంకటేష్, విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు తిప్పన్న, వన్నూరుస్వామి, తట్రగల్లు సుధాకర్, ఈశ్వరయ్య, రవి, తిమ్మప్ప, కుమార్, గురు,చిన్నరాయుడు, సిద్ధప్ప పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిన వైసీపీ వార్డు సభ్యులు: ఉరవకొండ మేజరు పంచాయతీ అధికారపార్టీకి చెందిన వార్డు సభ్యులు టీడీపీలోకి చేరారు. వజ్రకరూరు మండలం చిన్నహోతూరులో ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ సమక్షంలో వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, రవి, టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పయ్యావుల కేశవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బీటీపీకి నీరు తెచ్చి.. ప్రజల రుణం తీర్చుకుంటా

● రోడ్‌షోలో అమిలినేని సురేంద్రబాబు

కుందుర్పి, మే 6: బీటీపీకి నీరు తీసుకువచ్చి ప్రజల రుణం తీర్చుకుంటానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. మండలంలోని తూముకుంట, బెస్తరపల్లి, మందలపల్లి, కెంచంపల్లి, కలిగులిమి, అప్పాజీపాలెం, కొలిమిపాలెం. జంబుగుంపల తదితర గ్రామాల్లో సోమవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ నాయకులు, మహిళలు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అమిలినేని మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్లే కళ్యాణదుర్గం జీవనాడి అయిన బీటీపీ కాలువ పనులు ఆలస్యం అయిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే చంద్రబాబును ఒప్పించి కాలువ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు వేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ఇంటింటికి కుళాయి వేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో కొత్తగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో మన భూములను మనకు కాకుండా చేయాలని జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, మన పాసు పుస్తకాలపై ఆయన ఫొటో వేసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకునే భూములకు ఒరిజినల్ పత్రాలు ఇవ్వకుండా జిరాక్స్ కాపీలు ఇస్తాడంటే మనకు ఏమీ హక్కులు లేకుండా పోతాయన్నారు. బీటీపీ కాలువ, కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులు రెండున్నరేళ్లలో పూర్తి చేసి సాగు, తాగు నీరిచ్చి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. పరిశ్రమల కోసం తిమ్మసముద్రం ప్రాంతంలో ఉన్న భూమిలో విద్యుత్, నీరు, రోడ్లు వేయగలిగితే పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా ఒక్క చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. నిరుద్యోగ యువకులు చంద్రబాబుకు జై కొడుతూ టీడీపీ రావాలని కోరుకుంటున్నారన్నారు. మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారే రోజులు దగ్గరలోనే వున్నాయన్నారు. ప్రతి గ్రామంలో నిర్వహించే రోడ్‌షోకు ప్రజలు అశేషంగా తరలి వస్తున్నారంటే టీడీపీపై ఎంతటి ఆదరాభిమానాలు ఉన్నాయో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. 13వ తేదీన ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, మాజీ ఎంపీపీ దీనమ్మ, మాజీ కన్వీనర్ కర్తనపర్తి రామాంజనేయులు, మాజీ సర్పంచ్ రవి, రామాంజనేయులు, రాఘవేంద్రబాబు, చిత్రలింగప్ప, కన్వీనర్లు శ్రీనివాసులు, బాబు, తిప్పేస్వామి, గిడ్డప్ప, ఆనంద్, మల్లికార్జున, కేఎల్ ప్రసాద్, నాయకులు పాలాక్షి, అంగడి రామాంజనేయులు, విరుపాక్షి, సంజీవప్ప, శివలింగప్ప, ఓబయ్య, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


అమిలినేని సురేంద్రబాబుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు


మహిళలతో కలిసి విక్టరీ గుర్తు చూపుతున్న అమిలినేని

అభివృద్ధికి సంకేతం టీడీపీ

కళ్యాణదుర్గం రూరల్: అభివృద్ధికి సంకేతం తెలుగుదేశం పార్టీ అని ఐఎస్‌బీవీ వ్యవస్థాపకుడు టీపీ రామన్న అన్నారు. సోమవారం కంబదూరు మండలంలో కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తరపున ప్రచారం నిర్వహించారు.

వైవీఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు

పామిడి, మే 6: ఎప్పుడు వచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా లేదా అన్నది ముఖ్యం. ఎమ్మెల్యే వై వెంకటరామరెడ్డికి ఓటమి భయం పట్టుకుందంటూ మాజీ మంత్రి, గుంతకల్లు నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యే వైవీఆర్‌పై తనదైన శైలిలో సెటైర్లు వేశారు. మండలంలోని ఖాదర్‌పేట, అనుంపల్లి, కట్టకిందపల్లి, దిబ్బసానిపల్లి, రామగిరి ఎగువ, దిగువతండాలు, రామగిరిలో సోమవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ఆయనకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో, పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాకు అన్ని కులాలు సమానమేనన్నారు. నేను మీ ఇంటికి వస్తే మీ పక్కనే కుర్చుంటానన్నారు. ఎమ్మెల్యే వైవీఆర్ మిమ్మల్ని పక్కన కుర్చీలో కూడా కూర్చోనియ్యడని సెటైర్లు వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే కూటమిలో ఉండడం వల్ల ఎన్నో సంస్థలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు వల్లనే సాధ్యమన్నారు. అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని చెరువులకు నీరు తెప్పించేదుకు కృషి చేస్తానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుని మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తామన్నారు. రాష్ట్రం దాదాపు ఇరవై ఏళ్ల వెనక్కు పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు అందుతాయన్నారు. గుంతకల్లు అసెంబ్లీ, అనంతపురం పార్లమెంట్ రెండు స్థానాలలోనూ టీడీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు.


ఖాదర్‌పేటలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం


అనుంపల్లిలో గుమ్మనూరుకు గజ మాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి: తెలుగుదేశం పార్టీతోనే గిరిజనులు అభివృద్ధి చెందుతారని గుమ్మనూరు జయరాం, జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ అన్నారు. మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామంలో సోమవారం సాయంత్రం గిరిజన అభివృద్ధి కోసం కర పత్రాలను విడుదల చేశారు.

గుంతకల్లు: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనే అభివృద్ధి సాధ్యపడుతుందని, ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాంను, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలంటూ గుమ్మనూరు నారాయణ స్వామి ఓటర్లను కోరారు. పట్టణంలోని రైల్వే డీజల్ షెడ్‌లోనూ, 31వ వార్డులోనూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు తలారి మస్తానప్ప పాల్గొన్నారు. మండలంలోని కదిరిపల్లి, ఇమాంపురం గ్రామాల్లో గుమ్మనూరు శ్రీనివాసులు ప్రచారం చేశారు.

గుత్తి: పట్టణంలో గుత్తి, గుత్తిఆర్ఎస్‌లో గుమ్మనూరు జయరాంను గెలపించాలని గుమ్మనూరు నారాయణ, ఆయన సతీమణి కమలమ్మతో పాటు కుటుంబ సభ్యులు సోమవారం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని బండగేరిలో కమలమ్మ, టీడీపీ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గుత్తి ఆర్ఎస్‌లోని 6వ వార్డులో 30కుటుంబాలు టీడీపీలో చేరారు. గుమ్మనూరు నారాయణ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సోమశేఖర్, రాము, ఎంకే చౌదరి, నారాయణస్వామి, వెంకటేష్, అబ్దుల్‌వహాబ్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ఉజ్వల భవిష్యత్తు: కాలవ

డీ.హీరేహాళ్, మే 6: సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రానికి ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. మండలంలోని మడేనహళ్లి, లింగమనహళ్లి, తమ్మేపల్లి, చెర్లోపల్లి, ఓబుళాపురం, సిద్ధాపురం, హెచ్ఎస్ తండా గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను, వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అరాచక పాలనను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామాలలో రోడ్‌షో నిర్వహించారు. కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 130 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ హయంలో వేల కోట్ల రూపాయలు నిధులు తెచ్చి రాయదుర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజలు ఈ ఎన్నికలలో టీడీపీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.


ప్రచారం నిర్వహిస్తున్న కాలవ శ్రీనివాసులు

50 కుటుంబాలు టీడీపీలో చేరిక


కాలవ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలంలోని రంగసముద్రం గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. సర్పంచ్ చంద్రశేఖర్, రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి, అశోక్, బోయ బొమ్మన్న, బోయ బాబు, శివలింగ తదితరులు చేరారు.

కుటుంబీకుల ప్రచారం: కాలవ శ్రీనివాసులును గెలిపించాలని ఆయన కూతురు గౌతమి, కణేకల్లు మండలంలోని గరుడచేడు, మీనహళ్లి, బిదురకుంతం, కొడుకు కాలవ భరత్ బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో ప్రచారం చేశారు.

దళిత ద్రోహి జగన్‌కు బుద్ధి చెప్పండి

కణేకల్లు: దళితుల మీద అనేక దాడులు, హత్యలు, అత్యాచారాలు జరిపించిన వైసీపీ అధినాయకుడు జగన్‌కు బుద్ధి చెప్పాలని ఎస్సీసెల్ అధికార ప్రతినిధి అంజిబాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితుల జీవన ప్రమాణాలను పెంచేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేసి దాదాపు 27 సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి దళితులు మద్దతు పలకాలని ఆయన కోరారు.

విజయ గంట మోగాలి

ఉరవకొండ, మే 6: ఎన్నికల ప్రచారం సందర్భంగా వజ్రకరూరు మండలంలోని పెద్దహోతూరులో వెలసిన బీరప్ప దేవాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ పూజలు చేసి గంట మోగించారు. అనంతరం ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు గజమాలతో కేశవ్‌ను సత్కరించారు.


గంట కొడుతున్న కేశవ్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గార్లదిన్నె, మే 6: మండలంలోని ఎగువపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన కిష్టప్ప (55) మరణించాడు. కిష్టప్ప గార్లదిన్నెలో ఉన్న తన కూతురు ఇంటికి వచ్చాడు. ఆదివారం బైక్‌లో కల్లూరు నుంచి గార్లదిన్నెకు బయలుదేరాడు. ఎగువపల్లికి చెందిన నరేంద్ర ముంటిమడుగు నుంచి ఎగువపల్లికి బైక్‌లో బయలుదేరాడు. వీరి వాహనాలు ఎదురెదురుగా ఎగువపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ కిష్టప్పను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సందట్లో సడేమియా..!

● సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్లతో ఓ అధికారి రాయబేరాలు

పుట్లూరు, మే 6: సందట్లో సడేమియా అన్న చందంగా రెవెన్యూ కార్యాలయంలో ఓ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారన్న కారణంగా సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ ఆపరేటర్లతో లోపాయికారిగా ఒప్పందాలు కుదుర్చుకొని సస్పెండ్ ఉత్తర్వులను పక్కనబెట్టి జీతాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంతో కొంత ముట్టజెబితే సస్పెండ్ అయినా మీ ఉద్యోగం అలాగే ఉంటుంది మీకు వచ్చే జీతంలో సగమైనా ఇవ్వండి అని రాయబేరాలకు దిగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే మండలంలో పలు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ ఆపరేటర్లు వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారని పత్రికల్లో, సోషల్‌మీడియాలో రావడంతో అధికారులు సస్పెండ్ చేయడం తెలిసిందే. వీటిని ఆసరాగా చేసుకున్న రెవెన్యూశాఖలోని ఓ అధికారి వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ కౌన్సిలర్

గుత్తి,మే6: అనంతపురంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ రమేష్ యాదవ్ సోమవారం టీడీపీలో చేరారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాజీ కౌన్సిలర్ రమేష్‌యాదవ్‌కు కండువవేసి పార్టీలో స్వాగతించారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్య టీడీపీ గెలుపుకు కృషి చేయాలని ఆయన సూచించారు.


రమేష్‌యాదవ్‌కు కండువా వేస్తున్న చంద్రబాబు

పోస్టల్ బ్యాలెట్ నమోదు గడువు పెంచాలి

రాయదుర్గం, మే 6: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ స్వీకరించేందుకు ఎన్నికల సిబ్బందికి నమోదు గడువును పెంచాలని ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ అధ్యక్షుడు కెంచె లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం రిటర్నింగ్ అధికారిణి కరుణకుమారిని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వందలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు గతంలో అనానుకూల పరిస్థితిలో నమోదు చేసి ఉండకపోతే మంగళ, బుధవారాలలో నమోదు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్, మే 6: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని కొత్తూరు గ్రామం క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బొలెరో వాహనంలో 576 టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ పంపామన్నారు.

రేపు ఏపీ ఈసెట్

అనంతపురం, మే 6: డిప్లమో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలను కల్పించేందుకు ఏపీ ఈసెట్-2024 పరీక్షలు బుధవారం జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ పరిధిలో మొత్తం 37,767 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని సెట్ నిర్వాహక కమిటీ చైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల పరిధిలో మొత్తం 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9 తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండో సెషన్ పరీక్షలు ప్రారంభమౌతాయని, గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

టీడీపీ ప్రచారంలో తప్పెట కొట్టాడని దాడి

రాయదుర్గం, మే 6: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఎన్నికల ప్రచారంలో తప్పెట కొట్టాడని వైసీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన డీ.హీరేహాళ్ మండలం కల్యం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కల్యం గ్రామానికి చెందిన దళిత హనుమంతు అనే వ్యక్తి సోమవారం గ్రామంలో కాలవ శ్రీనివాసులు ప్రచారంలో తప్పెట కొట్టాడు. ప్రచారమంతా ముగిసిన అనంతరం హనుమంతును పిలిచి టీడీపీకి తప్పెట ఎలా కొట్టావని వైసీపీ సర్పంచ్ నాగరాజు తమ్ముడు శివ, బోయ దేవరాజులు అతనిపై దాడికి పాల్పడ్డారు. విడిపించుకునేందుకు ఎంత ప్రయత్నం చేసినా వదలకుండా దాడి చేయడంతో గాయపడ్డాడు. గాయపడిన అతనిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

9లోగా ప్రవేశాలు నిర్ధారించుకోండి

● ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 6: అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలను నిర్ధారించుకోవాలని అంబేడ్కర్ గురుకుల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇదివరకు మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థుల మార్కుల ఆధారంగా రాష్ట్ర అధికారులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 720 సీట్లకు 720 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 400 సీట్లకు 400 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. దరఖాస్తు సమయంలో ఎంపిక చేసుకున్న ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లను సంప్రదించి సంబంధిత పత్రాలతో ఈనెల 9లోగా ప్రవేశాలను నిర్ధారణ చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజల దీవెనలే శ్రీరామరక్ష: అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి టౌన్, మే 6: ప్రజల దీవెనలే మా కుటుంబానికి శ్రీరామరక్ష అని కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రెడ్డివారిపాలెంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. తనను గెలిపిస్తే తాడిపత్రికి పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు రంగనాథ్‌రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


యువకుడితో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

దళితవాడలో ప్రచారం: పట్టణంలోని దళితవాడలో సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు సూర్యముని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ప్రచారంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించండి

పెద్దవడుగూరు: వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని జి. వెంకటాంపల్లి, విరుపాపురం, ఆవులాంపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన అంబికా లక్ష్మీనారాయణ, జేసీ అశ్మిత్‌రెడ్డిలకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, పుట్లూరు లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌యాదవ్, గంగరాజుయాదవ్, నాయకులు నాగరాజు, చిరంజీవి, దస్తగిరి, రంగనాయకులు పాల్గొన్నారు.

FORMAT C-1

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble supreme court in W.P.(Civil) No. 536 of 2011 (Public interest foundation & ors.Vs. Union of India & Anr.)

Name and address of Candidate: GUMMANUR JAYARAM, S/o P.Basappa, Residing at D.NO.2-13, Gummanur (V), Chippagiri (M), KURNOOL DISTRICT, A.P.

Name of Political Party: TELUGU DESAM PARTY

(Independent candiates should write "Independent" here)

Name of Election: LEGISLATIVE ASSEMBLY (APLA 2024)

Name of Constituency : 150 GUNTAKAL ASSEMBLY CONSTITUENCY

I, GUMMANUR JAYARAM (Name of Candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents.

(A) Pending Criminal Cases

SI. NO.	Name of Court	Case NO. AND Date	Status of the Case(s)	Section(s) of Acts Concerned and brief description of offence(s)
1.	Not yet field In the Court	31/2024, Dated: 01.04.2024	Case under Investigation, II-Town Police Station, Guntakal.	188 IPC (model Code of Conduct during General Election - 2024

(B) Details About cases of conviction of criminal offences

S.No	Name of Court & Date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment imposed
1.	NIL	NIL	NIL

* In the Case of Election to Council of States or Election to Legislative Council by MLA's, mention the election concerned in place of name of constituency.

Sd/- GUMMANUR JAYARAM
CANDIDATE OF TELUGU DESAM PARTY,
150 GUNTAKAL ASSEMBLY CONSTITUENCY.